క్లుప్తంగా

ఘనంగా మాజీ ఎంపీ జన్మదిన వేడుకలు


రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న నాయకులు

శంకర్‌పల్లి: మున్సిపాలిటీలో మాజీ ఎంపీ గడ్డం రంజిత్‌రెడ్డి జన్మదిన వేడుకలను కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ వెంకట్రామిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జనార్ధన్‌రెడ్డి, కౌన్సిలర్ శ్రీనాథ్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం

కేశంపేట: మండల పరిధిలో కొండారెడ్డిపల్లి గ్రామంలో ఏర్పుల యాదమ్మ మంగళవారం మృతి చెందింది. మృతురాలిది నిరుపేద కుటుంబం కావడంతో బుధవారం అంత్యక్రియల నిమిత్తం గ్రామానికి చెందిన కానం ప్రేమ్‌కుమార్‌గౌడ్ రూ.5వేలు ఆర్థికసాయం అందించారు. మృతురాలి కుటుంబ సభ్యులకు ఆయన గ్రామస్తుల సమక్షంలో ఈ నగదును అందించారు. కార్యక్రమంలో ఉదయ్‌గౌడ్, వడ్ల కుమార్, దశరథ, లింగం, అశీఫ్, శ్రీశైలం యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు సన్మానం


తండావాసులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

షాద్‌నగర్: ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్‌గా ఎన్నికైన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌ను బుధవారం కొత్తూరు మండలం కొడిచర్ల గ్రామ పంచాయతీ కాజీగూడ తండావాసులు సన్మానించారు. ఈ సందర్భంగా పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేకు శాలువా కప్పి సత్కరించారు. తండాలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని గిరిజనులు ఎమ్మెల్యేను కోరారు. కార్యక్రమంలో బాలు నాయక్, రఘుపతి, డాక్యా, కిషన్‌నాయక్, సీతారాంనాయక్, రాంచంద్ర్యానాయక్, శ్రీను, శంకర్, నరేశ్, అశోక్, రాజు, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

నేడు వివిధ పార్టీల నాయకులతో సమీక్ష

శంకర్‌పల్లి: మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఓటరు జాబితాపై అన్ని రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ వెంకయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశం మధ్యాహ్నం 12 గంటలకు ఉంటుందని, ప్రతి పార్టీ నుంచి నాయకులు హాజరుకావాలని కోరారు. అదేవిధంగా ఈ నెల 21 వరకు ఓటరు జాబితాకు సంబంధించిన అభ్యంతరాలు స్వీకరిస్తామని, 29న తుది జాబితా విడుదల చేస్తామని ఆయన పేర్కొన్నారు.

రైతులను గోస పెడుతున్న ప్రభుత్వం


రోడ్డుపై పాలు పోసి నిరసన వ్యక్తం చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

ఆమనగల్లు: 'విజయ డెయిరీ పాల బిల్లులు చెల్లించకుండా రైతులను ప్రభుత్వం గోస పెడుతోంది. వెంటనే చెల్లించాలి. లేని పక్షంలో పాడి రైతులతో కలిసి ట్రాక్టర్లతో అసెంబ్లీని ముట్టడిస్తాం' అని జెడ్పీటీసీ మాజీ సభ్యురాలు అనురాధ, సింగిల్‌విండో చైర్మన్ గంప వెంకటేశ్ గుప్తా, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు పత్యానాయక్‌లు హెచ్చరించారు. పాల బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేస్తూ బుధవారం పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం హైదరాబాద్–శ్రీశైలం జాతీయ రహదారిపై ధర్నా చేశారు. రోడ్డుపై పాలు పారబోసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతు సమస్యలను పరిష్కరించకుండా ఇబ్బందులకు గురి చేస్తోందన్నారు. బీఆర్‌ఎస్ హయాంలో పక్షం రోజులకొకసారి బిల్లులు చెల్లించేదని, ప్రస్తుత ప్రభుత్వం మూడునెలలుగా చెల్లించకపోవడంతో రైతులు ఆర్థిక సమస్యలు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. వెంటనే బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ లలితకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మాజీ సభ్యులు కుమార్, సరిత, మాజీ సర్పంచ్ శ్రీనునాయక్, నాయకులు రఘు, బాలస్వామి, నిరంజన్‌గౌడ్, పరమేశ్, వెంకటేశ్, రమేశ్‌నాయక్, శివకుమార్, బద్దునాయక్, మల్యానాయక్, భాస్కర్‌రెడ్డి, శేఖర్, ప్రశాంత్, భాస్కర్, గణేశ్, బీమయ్య పాల్గొన్నారు.

నిధులు లేక.. పనులు సాగక

అసంపూర్తిగా మార్కెట్‌యార్డు నిర్మాణం

పిల్లర్ల దశలోనే నాన్‌వెజ్ బ్లాక్ • పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు


నిర్మాణ దశలోనే ఆగిపోయిన ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌యార్డు పనులు

శంకర్‌పల్లి: పండ్లు, కూరగాయలు, మాంసం ఇలా అన్ని ఒకేచోట విక్రయాలు సాగేలా గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా ఇంటిగ్రేటెడ్ మార్కెట్ యార్డు నిర్మాణాలకు శ్రీకారం చుట్టింది. అయితే ఆ పనులు నిధుల లేమితో అర్ధంతరంగా ఆగిపోయాయి. శంకర్‌పల్లిలో మార్కెట్‌యార్డు కోసం కేటాయించిన రూ.2కోట్ల నిధులు.. ప్రస్తుత ప్రభుత్వం అందించకపోవడమే కారణమని అధికారులు చెబుతున్నారు. ప్రభుత్వం, అధికారులు పట్టించుకోకపోవడంతో జరిగిన నిర్మాణ పనులు ఆదిలోనే శిథిలావస్థలోకి వెళ్లేలా పరిస్థితి కన్పిస్తోంది. శంకర్‌పల్లి పట్టణంలోని ఇంటిగ్రేటెడ్ మార్కెట్ యార్డు పరిస్థితి ఇది.

2021 జూన్‌లో మార్కెట్‌యార్డు పనులకు శంకుస్థాపన..

సామాన్యులకు, వ్యాపారులకు అన్ని సదుపాయాలు కల్పించి, కొనుగోళ్లు పెంచే ఉద్దేశంతో అప్పటి ప్రభుత్వం ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌యార్డు నిర్మాణాలను చేపట్టింది. దీన్ని రాష్ట్ర వ్యాప్తంగా అన్ని మున్సిపాలిటీల్లో ప్రారంభించింది. శంకర్‌పల్లి పట్టణంలో 30 గుంటల భూమిలో 2021 జూన్ నెలలో నాటి విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి రూ.2కోట్ల రాష్ట్ర ప్రభుత్వ నిధులతో పనులకు శంకుస్థాపన చేసింది. రెండేళ్లలో పూర్తి కావాల్సిన పనులు మూడున్నరేళ్లు కావొస్తున్నా ఇంకా ప్రారంభ దశలోనే ఉన్నాయి. నేటి ప్రభుత్వం నిధులు కేటాయించకపోవడంతో పనులు నిలిపివేసినట్లు అధికారులు పేర్కొంటున్నారు.

ఎకరా స్థలం లేని మున్సిపాలిటీ

శంకర్‌పల్లి పట్టణంలో ఇంటిగ్రేటెడ్ మార్కెట్ యార్డు నిర్మాణానికి మున్సిపాలిటీ అధికారులు, ప్రజాప్రతినిధులకు మొదటి నుంచి అడ్డంకులే వచ్చాయి. దీనికి గల ప్రధాన కారణం మున్సిపాలిటీకి ఒక ఎకరా ప్రభుత్వ స్థలం కూడా లేకపోవడమే. దీంతో మార్కెట్ యార్డు నిర్మించేందుకు అధికారులకు పెద్ద తలనొప్పిగా మారింది. అప్పటి మంత్రి సబితారెడ్డి ప్రత్యేక చొరవ తీసుకొని ఆర్‌అండ్‌బీ అధికారులతో మాట్లాడి పట్టణంలోని ప్రభుత్వ అతిథి గృహంలోని 30గుంటల భూమిని కేటాయించారు. అయితే ఈ స్థలాన్ని మున్సిపాలిటీకి అప్పగించే సమయంలోనూ ఆర్‌అండ్‌బీ అధికారులు కాస్తా ఇబ్బందికర పరిస్థితులకు గురి చేశారు.


పిల్లర్ల దశలో ఉన్న నాన్‌వెజ్ బ్లాక్ నిర్మాణం

రెండు బ్లాకులుగా నిర్మాణాలు

మార్కెట్ యార్డును వెజ్ బ్లాకుగా ఒకటి, మరొకటి నాన్‌వెజ్ బ్లాకుగా విభజించారు. అయితే ఈ రెండు బ్లాకులలో మొత్తంగా సుమారు 80 నుంచి 100 యూనిట్లు వచ్చే అవకాశం ఉంది. వీటిని పండ్లు, కూరగాయలు, మాంసం విక్రయదారులకు కేటాయిస్తారు. అయితే 2021 జూన్‌లో శంకుస్థాపన అయినప్పటి నుంచి వెజ్ బ్లాకులో ఒక అంతస్తు నిర్మాణం చేపట్టి మరొక అంతస్తు నిర్మాణం పెండింగ్‌లో ఉంది. అదే నాన్‌వెజ్ బ్లాకు పనులు మాత్రం పిల్లర్ల దశలోనే ఆగిపోయాయి. ప్రస్తుతం ఆ ప్రాంతంలో పెద్ద ఎత్తున గడ్డి, చెత్తాచెదారం నిండి, పశువులు, శునకాలకు ఆవాసంగా మారింది.

ట్రాఫిక్ ఇబ్బందులు తొలగుతాయి

మార్కెట్‌యార్డు నిర్మాణ పనులు పూర్తయితే పట్టణ వాసులకు భారీస్థాయిలో ట్రాఫిక్ ఇబ్బందులు తొలగుతాయి. ప్రస్తుతం పట్టణంలో జరిగే మార్కెట్ అంతా మా ఇంటి పరిసరాల్లోనే జరుగుతోంది. నిత్యం ట్రాఫిక్‌తో చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. అధికారులు చొరవ తీసుకొని త్వరతగతిన పనులు పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలి.

– మాచుగారి మనీశ్‌రెడ్డి, శంకర్‌పల్లి

ఆదేశాల కోసం చూస్తున్నాం

మార్కెట్‌యార్డు నిర్మాణ స్థితిగతులపై జిల్లా కలెక్టర్ పర్యవేక్షిస్తున్నారు. ప్రస్తుత ప్రభుత్వం మార్కెట్‌యార్డు నిర్మాణాల కోసం నిధులు కేటాయించలేదు. నిధులు కేటాయించగానే.. మిగిలిన పనులపై అంచనా వేసి టెండరు వేస్తాం.

– శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్, శంకర్‌పల్లి

పరిశుభ్రత అందరి బాధ్యత

ప్రధానోపాధ్యాయుడు రసూల్


విద్యార్థులకు పోటీలను నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

షాద్‌నగర్‌రూరల్: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని ప్రధానోపాధ్యాయుడు రసూల్ అన్నారు. ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని చించోడ్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం స్వచ్ఛతా హీ సేవ–2024 కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా స్వచ్ఛత–పరిశుభ్రత అనే అంశంపై విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందించారు. అనంతరం రసూల్ మాట్లాడుతూ.. పరిసరాల పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందన్నారు. ప్రతి ఒక్కరూ తమ ఇంటితో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ఎక్కడ పడితే అక్కడ చెత్త వేయకుండా మున్సిపల్ వాహనాల్లోనే వేయాలని సూచించారు. చెత్తాచెదారం పేరుకుపోతే ఈగలు, దోమలు వ్యాపించి రోగాలు బారిన పడతామన్నారు. ప్రతి ఒక్కరూ స్వచ్ఛత, పరిశుభ్రతపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి జైపాల్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

నందిగామ: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సూచించారు. కొత్తూరు మండల పరిధిలోని ఇన్ముల్‌నర్వలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రీడాపోటీలకు బుధవారం ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. విద్యార్థులు కేవలం చదువుతో పాటు ఆసక్తి ఉన్న క్రీడలపై దృష్టి సారించాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహిస్తున్న ప్రతి క్రీడాపోటీలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం క్రీడల్లో గెలుపొందిన క్రీడాకారులకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ఎంఈఓ కృష్ణారెడ్డి, హెచ్‌ఎం వెంకట్రామిరెడ్డి, జోనల్ సెక్రటరీ రాజశేఖర్‌రెడ్డి, నాయకులు సుదర్శన్‌గౌడ్, హరినాథ్‌రెడ్డి, రవికుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.


విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్యే

కళాశాలలో స్వచ్ఛభారత్ అభియాన్


స్వచ్ఛభారత్ అభియాన్‌లో పాల్గొన్న ఏబీవీపీ నాయకులు, విద్యార్థులు

చేవెళ్ల: సమాజంలో ప్లాస్టిక్ వినియోగం రోజురోజుకు పెరిగిపోతుందని దీంతో భూ ప్రపంచానికి నష్టం వాటిల్లుతోందని ఏబీవీపీ నగర కార్యదర్శి మహిపాల్ అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం ఏబీవీపీ స్టూడెంట్ ఫర్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో ప్లాస్టిక్ ఫ్రీ క్యాంపస్, స్వచ్ఛభారత్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు విద్యార్థులతో కలిసి కళాశాల ఆవరణలో ఉన్న చెత్తచెదారాలను శుభ్రం చేశారు. ప్లాస్టిక్ వినియోగంతో కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. ప్లాస్టిక్ వస్తువులు, ఖాళీ వాటర్ బాటిళ్లను, కవర్లను ఎక్కడ పడితే అక్కడ పడేయకుండా డస్ట్‌బిన్‌లో వేయాలని చెప్పారు. ఇలా ఒక చోటు వేసిన ప్లాస్టిక్‌ను రీసైక్లింగ్ లేదా కాల్చివేస్తారని తెలిపారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కోరుతూ కళాశాల ఆవరణ మొత్తం శుభ్రం చేశారు. కార్యక్రమంలో నాయకులు అనిల్, శివ, నితీశ్, ప్రణయ్, హీరోశ్, అఖిల, ప్రవళిక, సంధ్య, శిరీష, సలోని, అమూల్య, భానుశ్రీ, విద్యార్థులు తదితరులు ఉన్నారు.

ప్రధానోపాధ్యాయుడికి అవార్డు


అవార్డు పొందిన హెచ్‌ఎం ఆవుల రవి

షాద్‌నగర్: గురుపూజోత్సవాన్ని పురస్కరించుకొని హైదరాబాద్ క్లాస్‌మేట్ క్లబ్ అసోసియేషన్ వారు వివిధ పాఠశాలల్లో పని చేస్తున్న ఉత్తమ ఉపాధ్యాయులను ఎంపిక చేసి వారికి అవార్డులను అందజేయడంతో పాటు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని విఠ్యాల ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా పని చేస్తూ విద్యారంగాభివృద్ధికి విశేషంగా కృషి చేస్తున్న ఆవుల రవి అవార్డుకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌లోని క్లబ్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన అవార్డుల ప్రధానోత్సవ కార్యక్రమంలో ఆవుల రవిని క్లాస్‌మేట్ క్లబ్ ఆర్గనైజేషన్ సభ్యులు రాఘవేందర్, రమేశ్, లయన్ ఇంటర్నేషన్ సభ్యులు గుర్రం పాండయ్య, శరత్‌బాబు, కల్వ రాంరెడ్డిలు ఘనంగా సన్మానించి అవార్డును అందజేశారు.

పాఠశాలలో అసాంఘిక కార్యక్రమాలు


పాఠశాల భవనంపై మందుబాబులు పడేసిన విస్తర్లు

కొందుర్గు: మండల కేంద్రంలోని బాలికల ప్రాథమికోన్నత పాఠశాల ఆవరణలో మందుబాబులు విందులు చేసుకుంటున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాఠశాలకు ప్రహరీ లేకపోవడంతో సెలవుదినాల్లో, రాత్రి సమయాల్లో మందుబాబులు మద్యం సేవించి ఖాళీ సీసాలు పాఠశాల ఆవరణలో పడేస్తున్నారని వాపోతున్నారు. తినుబండారాలకు సంబంధించిన చెత్తకాగితాలు, విస్తర్లు అక్కడే పడేస్తున్నారని, ఖాళీ సీసాలు పగులగొట్టడంతో విద్యార్థులకు గుచ్చుకుంటున్నాయని ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పేర్కొంటున్నారు. పాఠశాలపైన విద్యార్థుల సౌకర్యార్థం కోసం ఏర్పాటు చేసిన వాటర్ ట్యాంక్‌ను పగులగొట్టారని, ఈ విషయమై పలుమార్లు అధికారులు, నాయకులకు తెలిపినా స్పందించడం లేదని వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించాలని కోరుతున్నారు.

ర్యాలీని విజయవంతం చేయండి

షాద్‌నగర్: మిలాద్–ఉన్–నబీ పర్వదినాన్ని పురస్కరించుకొని పట్టణంలో గురువారం నిర్వహిస్తున్న ర్యాలీని విజయవంతం చేయాలని పీసీసీ సభ్యుడు బాబర్‌ఖాన్ ఒక ప్రకటనలో కోరారు. పట్టణంలోని పటేల్ రోడ్డులో ఉన్న మజీద్ నుంచి మధ్యాహ్నం జోహర్ నమాజ్ తర్వాత ర్యాలీ ప్రారంభమవుతుందని తెలిపారు. ఈ ర్యాలీని ఫరూఖ్‌నగర్ వరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మైనార్టీ పెద్దలు, నాయకులు, యువకులు పెద్దసంఖ్యలో విచ్చేసిన ర్యాలీని విజయవంతం చేయాలని కోరారు.

గణపయ్యా.. వెళ్లి రావయ్యా

- కనుల పండువగా గణనాథుడి నిమజ్జనోత్సవం
- లడ్డూ వేలంలో ఉత్సాహంగా పాల్గొన్న భక్తులు
- శోభాయాత్రలో ఆకట్టుకున్న యువతీయువకుల నృత్యాలు


షాబాద్: నాన్‌ంధార్‌ఖాన్‌పేట్‌లో లడ్డూ దక్కించుకున్న పొన్న సంజీవరెడ్డి


షాద్‌నగర్‌రూరల్: సింగిల్ విండో మాజీ డైరెక్టర్ చంద్రయ్యకు లడ్డూ అందజేస్తున్న మండప నిర్వాహకులు


శంకర్‌పల్లిలో రూ.12.51లక్షలకు గణనాథుడి లడ్డూ దక్కించుకున్న ప్రకాశ్‌గుప్తా

వినాయక చవితి నుంచి 11 రోజుల పాటు పూజలందుకున్న వినాయకుడి నిమజ్జనోత్సవం చేవెళ్ల, షాద్‌నగర్ నియోజకవర్గాల్లో బుధవారం కనుల పండువగా కొనసాగింది. ఈ సందర్భంగా నిర్వహించిన స్వామివారి లడ్డూ వేలంలో ప్రజాప్రతినిధులు, నాయకులు ఉత్సాహంగా పాల్గొని ప్రసాదాన్ని దక్కించుకున్నారు. ఉత్సవ కమిటీ సభ్యులు లడ్డూ దక్కించుకున్న వారిని పూలమాలలు, శాలువాలతో సన్మానించి ప్రసాదాన్ని అందజేశారు. అనంతరం అందంగా ముస్తాబు చేసిన వాహనాలపై గణనాథులను తరలించి శోభాయాత్ర నిర్వహించారు. అనంతరం చెరువుల వద్దకు చేరుకొని గంగమ్మ ఒడికి గణనాథుడిని చేర్చుతూ.. బైబై గణేశా అంటూ వీడ్కోలు పలికారు. పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించారు.


షాబాద్: గణేశ్ చౌక్ వద్ద వినాయకుడి శోభాయాత్రలో నాయకులు, ప్రజాప్రతినిధులు


షాబాద్ రూ.19లక్షలకు లడ్డూ దక్కించుకున్న తమ్మలి రవీందర్, కావలి మహేశ్‌యాదవ్


షాబాద్‌లో గణనాథుడి శోభాయాత్ర


షాద్‌నగర్: న్యూసిటీ కాలనీలో లడ్డూలను కైవసం చేసుకున్న భక్తులు


షాద్‌నగర్‌రూరల్: గణనాథుడి శోభాయాత్రలో పాల్గొన్న మహిళలు, చిన్నారులు


షాద్‌నగర్‌రూరల్: గణనాథుడి శోభాయాత్రలో పాల్గొన్న ఉత్సవ కమిటీ సభ్యులు


మొయినాబాద్‌రూరల్: హిమాయత్‌నగర్ చౌరస్తాలో వినాయకుల శోభాయాత్ర

మొక్కజొన్నలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు


బోడంపహాడ్‌లో సాగుచేసిన మొక్కజొన్న పంట

షాబాద్: వర్షాధార పంటలో ఒకటైన మొక్కజొన్నను ఈ ఖరీఫ్‌లో చాలా మంది రైతులు సాగు చేశారు. మే నెల చివరి వారంలో విత్తనాలు వేసిన రైతులు పంటలో సస్యరక్షణ చర్యలు తీసుకోవాలని మండల వ్యవసాయాధికారి వెంకటేశం సూచించారు. పంట వేసిన 30 నుంచి 45 రోజుల మధ్య కాండం తొలుచు పురుగు సోకే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని, కొన్ని గ్రామాల్లో ఇప్పటికే పంటకు ఈ తెగులు సోకినట్లు గమనించామని తెలిపారు. పురుగు మొక్క కాండాన్ని తినేయడంతో కంకి పాడై దిగుబడి తక్కువగా వస్తుందని పేర్కొన్నారు. రైతులు నష్టపోకుండా ఉండాలంటే తెగులు సోకిన మొక్కజొన్న చేలకు కార్బోఫిరాన్ 3జి గుళికల మందును ఎకరాకు 3 నుంచి 5 కిలోల చొప్పున మొక్క సుడులలో గుళికలను వేయడంతో తెగులును నివారించవచ్చన్నారు. అయితే మసితెగులు సోకడంతో కూడా దిగుబడి తగ్గే ప్రమాదం ఉంది. దీని నివారణకు ప్రొఫినోపాస్ అనే మందును ఒక లీటరు నీటిలో 2మిల్లీలీటర్ల చొప్పున కలిపి పిచికారీ చేయాలని, అదేవిధంగా ఇమిడా క్లోరోఫైడ్ ఒక లీటరు నీటిలో ఒక మిల్లీలీటరు చొప్పున కలిపి పిచికారీ చేస్తే చీడపీడలు నశించి ఎకరాకు 25 నుంచి 30 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తుందని, రైతులు పంటలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.